సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

వడివడిగా విస్తరణ



గాజువాక హైస్కూల్ రోడ్డు

- ప్రధాన రహదారులకు కొత్తరూపు
- కోట్లాది రూపాయలతో అభివృద్ధి

గాజువాక: గాజువాకలో ప్రధాన రహదారుల విస్తరణ పనులు చకచకా సాగుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు, జీవీఎంసీ సాధారణ నిధులతో కోట్ల రూపాయలను వెచ్చించి పనులు పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే గాజువాక హైస్కూల్ రోడ్, బీసీ రోడ్డు అభివృద్ధి పనులను పూర్తి చేసిన విషయం తెలిసిందే. తాజాగా గాజువాకలోని కణితి రోడ్, కూర్మన్నపాలెంలోని దువ్వాడ స్టేషన్ రోడ్, పెదగంట్యాడలోని సిద్దేశ్వరం ప్రధాన రహదారి విస్తణ పనులు జీవీఎంసీ ఆధ్వర్యంలో చకచకా సాగుతున్నాయి. ఈ రోడ్ల విస్తరణ, అభివృద్ధి ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉండిపోయిన విషయం తెలిసిందే. దీనిపై దృష్టి సారించిన ప్రస్తుత ప్రభుత్వం ఈ రోడ్ల అభివృద్ధిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించడంతో పనులు వేగవంతమయ్యాయి.

గాజువాక హైస్కూల్ రోడ్డు సాకారం

గాజువాక హైస్కూల్ రోడ్డు అభివృద్ధి పనులు ఏళ్ల తరబడి కార్యరూపం దాల్చలేదు. గతంలో ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలు వచ్చినా వివిధ కారణాలతో అప్పటి ప్రభుత్వం వాయిదా వేస్తూ వచ్చింది. దీనిపై దృష్టి సారించిన ప్రస్తుత ప్రభుత్వం రోడ్డును రూ.1.10 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసింది. ప్రస్తుతం ఈ రోడ్డు 40 అడుగుల వెడల్పుతో **అందుబాటులోకి వచ్చింది.**

బీసీ రోడ్డులో ట్రాఫిక్ కష్టాలకు చెల్లు

బీసీ రోడ్డు అంటేనే ట్రాఫిక్ కష్టాలకు ప్రతిరూపంగా చెబుతారు. అలాంటి రోడ్డు అభివృద్ధి కత్తిమీద సాములా మారినా ప్రస్తుత ప్రభుత్వం ఆ పనిని పూర్తి చేసింది. జగన్ మోహన్‌రెడ్డి సీఎంగా అధికారం చేపట్టిన కొద్ది కాలానికే ఈ రోడ్డును రూ.70 లక్షలతో అభివృద్ధి చేశారు. రోడ్డు మధ్యలో రూ.11 లక్షలతో డివైడర్‌ను, దీంతో పాటు మరో రూ.19 లక్షలతో సెంట్రల్ లైటింగ్‌ను తీర్చిదిద్దారు. ఈ కారణంగా కాకతీయ జంక్షన్ వరకు **బీసీ రోడ్డులో వన్ వే ట్రాఫిక్** అందుబాటులోకి వచ్చి ట్రాఫిక్ కష్టాలు తగ్గాయి.

సిద్దేశ్వరం రోడ్డు త్వరలో సిద్ధం

పెదగంట్యాడలోని సిద్దేశ్వరం ప్రధాన రహదారిని రూ.3.7 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. దల్లివాని పాలెం జంక్షన్ నుంచి సిద్ధేశ్వరం మీదుగా బీసీ రోడ్డు వరకు ఈ రోడ్డును విస్తరించడంతో పాటు అభివృద్ధి చేయడానికి రూ.2 కోట్లు ఖర్చు చేస్తున్నారు. విస్తరణ, రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. త్వరలోనే మరో రూ.1.7 కోట్లతో ఫుట్‌పాత్‌లను నిర్మించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేశారు.



గాజువాక బీసీ రోడ్డు



సిద్దేశ్వరం రోడ్డు



వార్డు : 67
గాజువాక హైస్కూల్ రోడ్డు
మొత్తం వ్యయం : రూ.1.10 కోట్లు

వార్డు : 86
దువ్వాడ స్టేషన్ రోడ్డు
మొత్తం వ్యయం : రూ. 11 కోట్లు

వార్డు : 74
సిద్ధేశ్వరం రోడ్డు
మొత్తం వ్యయం : రూ.3.7 కోట్లు

66 అడుగుల వెడల్పుతో కణితి రోడ్డు

గాజువాకలోని కణితి రోడ్డును వంటిల్లు జంక్షన్ నుంచి కొత్త గాజువాక మార్కెట్‌ను ఆనుకొని ఉన్న బీసీ రోడ్డు వరకు విస్తరిస్తున్నారు. దీని కోసం రూ.6.4 కోట్లను ఖర్చు చేస్తున్నారు. 66 అడుగుల వెడల్పుతో 1.25 కిలోమీటర్ల మేర విస్తరించేందుకు రూ.3 కోట్లను ఖర్చు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. మరో రూ.1.9 కోట్లతో రోడ్డుకిరువైపులా కాలువలను నిర్మిస్తున్నారు. కాలువపై అదనంగా రూ.1.5 కోట్ల ఖర్చుతో ఫుట్‌పాత్‌లను అందుబాటులో తెచ్చే విధంగా ప్రతిపాదనలు రూపొందించారు.



కణితి రోడ్డు విస్తరణలో భాగంగా నిర్మితమవుతున్న డ్రెయిన్లు

వార్డు : 66

కణితి రోడ్డు	బీసీ రోడ్డు
మొత్తం వ్యయం	మొత్తం వ్యయం
రూ.6.4 కోట్లు	రూ.1 కోటి

చకచకా దువ్వాడ స్టేషన్ రోడ్డు విస్తరణ

కూర్మన్నపాలెంలోని దువ్వాడ స్టేషన్ రోడ్డు విస్తరణ పనులను రూ.11 కోట్లతో చేపట్టారు. ఈ రోడ్డును వందడుగుల వెడల్పుతో విస్తరించి 1.6 కిలోమీటర్ల వరకు అభివృద్ధి చేయనున్నారు. దీనికోసం ఇప్పటికే ఈ రోడ్డులో సుమారు 60 నిర్మాణాలను తొలగించిన అధికారులు మరో పది నిర్మాణాలను తొలగించాలని నిర్ణయించారు. అందుకనుగుణంగా చర్యలను చేపట్టారు. ప్రస్తుతం రోడ్డుకిరువైపులా కాలువల నిర్మాణానికి సంబంధించిన పనులు సాగుతున్నాయి.



దువ్వాడ రోడ్డు విస్తరణలో భాగంగా రాజీవ్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న డ్రెయిన్లు

జనవరి నాటికి మేజర్ పనులు పూర్తి



గాజువాకలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఎమ్మెల్యే నాగిరెడ్డి చొరవతో ప్రతి పనికీ నిధులు సకాలంలో మంజూరవుతుండటంతో పనులు ఆటంకం లేకుండా పూర్తవుతున్నాయి. ఇప్పటికే హైస్కూల్ రోడ్, బీసీ రోడ్ పనులను పూర్తి చేశాం. తాజాగా సిద్దేశ్వరం రోడ్ విస్తరణ పూర్తి చేశాం. ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్న కణితి రోడ్, దువ్వాడ స్టేషన్ రోడ్ పనులు త్వరత్వరగా సాగుతున్నాయి. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ స్వయంగా పనులను పరిశీలిస్తున్నారు. అనేక ప్రాంతాల్లో సీసీ రోడ్లు పూర్తయ్యాయి. మేజర్ కల్వర్టుల నిర్మాణం జరిగింది. జనవరి నాటికి మరిన్ని మేజర్ పనులు పూర్తవుతాయి.
– పి.సింహాచలం, గాజువాక జోనల్ కమిషనర్

ప్రధాన రోడ్ల అభివృద్ధి అభినందనీయం



మేజర్ రోడ్లను విస్తరించడంతో పాటు అభివృద్ధి చేస్తుండటంతో ట్రాఫిక్ కష్టాలు తగ్గుతున్నాయి. గతంలో పాతగాజువాక జంక్షన్‌లో చాలా ఇబ్బంది పడేవాళ్లం. ఇప్పుడు పరిష్కారమైంది. గాజువాక హైస్కూల్ రోడ్‌లో సమస్యను కూడా పరిష్కరించారు. బీసీ రోడ్‌లో సెంటర్ మీడియన్ డివైడర్ వేయడంతో వన్ వే కింద అభివృద్ధి అయ్యింది. దీనివల్ల రాకపోకలకు బాగుంది. ప్రధాన రోడ్లన్నీ అభివృద్ధి చేయడం అభినందించదగ్గ విషయం.
– పి.గణేష్, గాజువాక

క్లుప్తంగా

వలంటీర్ల నియామకాలకు ఇంటర్వ్యూలు రేపు

గాజువాక: గాజువాకలోని వివిధ వార్డు సచివాలయాల్లో వలంటీర్ల నియామకాలకు ఈ నెల 18న ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్టు జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం తెలిపారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. ఇంటర్వ్యూలు సోమవారం ఉదయం పది గంటలనుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి రెండున్నర నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగుతాయని తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో పాటు వాటి జిరాక్స్ కాపీలను తీసుకొని ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

సత్యదేవుని ఆలయంలో పారాయణం



విష్ణు సహస్ర నామ పారాయణం చేస్తున్న కమిటీ సభ్యులు

అగనంపూడి: స్థానిక షిర్డీ సాయి సేవా సమితి, పారాయణ కమిటీ ఆధ్వర్యంలో కేజీహెచ్ సమీపంలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. 35 మంది మహిళా బృందం పాల్గొని గోవింద నామాలు, హనుమాన్ చాలీసా, గురు పాదుకా స్తోత్రం పఠించి, వేంకటేశ్వరుని భక్తి గీతాలు ఆలపించారు. ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మి నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కె.అరుణ, డి.సత్యలక్ష్మి, ఆర్.సత్యశ్రీదేవి, షిర్డిసాయి ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జిప్సా సర్వసభ్య సమావేశం నేడు

గాజువాక: గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (జిప్సా) సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్టు ఆ సంఘం అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు తెలిపారు. పాత గాజువాకలోని యశోద విద్యానికేతన్ ఆవరణలో ఉదయం పది గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పాఠశాలల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్టు తెలిపారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం



శ్రీనివాస కల్యాణంలో పాల్గొన్న గోవింద మాలధారులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వికాస్‌నగర్‌లో శ్రీనివాస కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి వేకువజామున సుప్రభాత సేవ అనంతరం ప్రత్యేక పూజలు, తిరుమంజన సేవ, పంచామృతాభిషేకాలు చేశారు. ఉత్సవ మూర్తులను పల్లకీలో ఊరేగించారు. అనంతరం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీనివాసుడి కల్యాణాన్ని జరిపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, పెంటకోట వెంకట నాగేశ్వరరావు, వెంకట బాలా మణి, గోవింద మాలధారులు పాల్గొన్నారు.

ఉక్కు యాజమాన్యంపై రాష్ట్రపతికి ఫిర్యాదు

అగనంపూడి: సమాచార హక్కు చట్టాన్ని తూట్లు పొడుస్తున్న విశాఖ ఉక్కు యాజమాన్యంపై భారత రాష్ట్రపతికి ఫిర్యాదు చేసినట్లు స.హ.చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు తెలిపారు. విశాఖ ఉక్కులో జరుగుతున్న అనేక కార్యకలాపాలపై పలుమార్లు స.హ.చట్టం ద్వారా ప్రశ్నించానని తెలిపారు. వాటికి సమాధానం ఇవ్వకుండా, సమాధానం ఎవరి వద్ద లభ్యం అవుతుందో వారికి దరఖాస్తును పంపించకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్న తీరుపై రాష్ట్రపతికి శనివారం ఫిర్యాదు చేసినట్టు తెలియజేశారు.

శ్రీవారి వెండి పాదాల ఏర్పాటుకు భక్తుల సహకారం

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలో గల శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో స్వామి వారి వెండి పాదాలకు, గరుడ వాహనం తయారీకి భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. సీతమ్మధార, గాజువాక ప్రాంతాలకు చెందిన జి.హరిబాబు, మాధవి దంపతులు, జి.ఉమాపతి, విద్య దంపతులు, మణి, సురేఖ దంపతులు కలిసి వెండి పాదములకు రూ.1,30,000 లను శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు శనివారం అందజేశారు. తిరుమల బాలాజీకు గరుడ వాహనం నిమిత్తం గన్నవరానికి చెందిన సూరపనేని మోహన సాయి కృష్ణ, ప్రియాంక దంపతులు రూ.10,116, అయ్యప్పనగర్‌కు చెందిన రాము, లక్ష్మి దంపతులు రూ.10,116, నాతయ్యపాలేనికి చెందిన పెదపూడి నాగ నర్సింహమూర్తి, అచ్యుత లక్ష్మీ ప్రసన్న దంపతులు రూ.10,116, వెంకటేశ్వర కాలనీకి చెందిన నారాయణ రావు, కుమారి దంపతులు రూ.10,116 అందజేశారు. వెంకటేశ్వర కాలనీకి చెందిన నాగేశ్వరరావు వెండి ఆచమన పాత్రలను సమర్పించారు. వెంకటేశ్వర కాలనీకు చెందిన రమణ వంటశాలకు అవసరమైన గ్యాస్ సిలిండర్లను అందజేశారు.



వెండి పాదాలకు నగదు అందజేస్తున్న భక్తులు

ఆకట్టుకుంటున్న పిరమిడ్లు



జయలక్ష్మి ఆధ్వర్యంలో తయారు చేసిన పిరమిడ్లు

పెదగంట్యాడ: పత్రీజీ ధ్యాన మహాయోగంలో వినాయక ధ్యాన కేంద్రం నిర్వాహకురాలు జయలక్ష్మి రూపొందించిన రంగుల పిరమిడ్‌లు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. హైదరాబాద్‌లోని కడ్తాల్‌లోని మహేశ్వర మహా పిరమిడ్ వద్ద నిర్వహిస్తున్న పత్రీజీ ధ్యాన మహాయోగంలో ఇవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో కృష్ణ, దేవి, లత, సురేష్, కుసుమ, శ్రీను, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో సంక్షేమ కాంతులు

పెదగంట్యాడ: ఒక పక్క అభివృద్ధి, మరో పక్క సంక్షేమంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. అర్హతే ప్రామాణికంగా అనేక పథకాలు అందిస్తూ పేదల జీవితాల్లో సంక్షేమ కాంతులు తీసుకువచ్చారన్నారు. 74వ వార్డు సిద్దేశ్వరం సచివాలయ పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి, అక్రమాలకు తావులేకుండా అన్ని వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారని, అటువంటి ముఖ్యమంత్రి మళ్లీ ఈ రాష్ట్రానికి కావాలన్నారు. ముందుగా ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, సత్తిరెడ్డి, సత్యం, కృష్ణ, అప్పలనాయుడు, రామలక్ష్మి, రాము తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

జీడీఏ, హెల్త్ కేర్ బిల్లింగ్‌లో ఉచిత శిక్షణ, ఉపాధి

అక్కిరెడ్డిపాలెం: ఇంటర్ పాస్/ఫెయిల్ అయిన వారికి జనరల్ డ్యూటీ అసిస్టెంట్ (జీడీఏ), డిగ్రీ పాసైన వారికి హెల్త్ కేర్ బిల్లింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు శనివారం తెలిపారు. షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో తులసీ నర్సింగ్ కాలేజ్‌లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి గలవారు 72079 53919, 76809 45357 నంబర్లలో సంప్రదించి, పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గాజువాక: కేఎన్నార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సంస్థ ఛైర్మన్ కరణంరెడ్డి నర్సింగరావు తెలిపారు. పాతకర్ణవానిపాలెంలోని రామాలయం ఎదురుగా గల సామాజిక భవనంలో ఉదయం తొమ్మిది గంటలకు శిబిరం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈసీజీ, బీపీ, షుగర్, క్యాన్సర్ పరీక్షలతో పాటు కంటి, దంత, వినికిడి పరీక్షలను చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేస్తామన్నారు.

‘గనుల లీజులను పునరుద్ధరించాలి’

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌కు రాష్ట్రంలో కేటాయించిన గనుల లీజులను పునరుద్ధరించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో స్టీల్‌ప్లాంట్‌కు గర్భం మాంగనీస్ గని, సారిపల్లి ఇసుక రీచ్‌లను కేటాయించిందన్నారు. లీజు గడువు ముగిసినా పునరుద్ధరించకపోవడం వల్ల ప్లాంట్‌పై భారం పెరుగుతోందన్నారు. అదే విధంగా యాజమాన్యం అధికారులకు జీతాలు పూర్తిగా చెల్లించకపోవడం అన్యాయమన్నారు. ప్లాంట్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా యాజమాన్యం వ్యవహరిస్తోందన్నారు. ఇకనైనా యాజమాన్యం సకాలంలో జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, జి.ప్రభాకరరెడ్డి, బీఎంకె నాయక్, జి.వి.సుబ్బయ్య, గంగవరం గోపి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజశేఖర్

జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ

గాజువాక: ఇటీవల నగరంలో నిర్వహించిన జిల్లా స్థాయి విశాఖ బాలోత్సవం–2023లో గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ ఉత్సవంలో జరిగిన చిత్రలేఖనం పోటీల్లోని జూనియర్స్ విభాగంలో 500 మంది విద్యార్థులు పాల్గొనగా, గాజువాక హైస్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు పోటీల్లో రాణించారు. వారిలో ఏడో తరగతి చదువుతున్న సీహెచ్.భవ్యశ్రీ ప్రథమ బహుమతి సాధించగా, ఐదుగురు విద్యార్థులకు ప్రశంసా పత్రాలు లభించాయి. ఈ మేరకు పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.విజయ ప్రశాంతి విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. చిత్రకళ ఉపాధ్యాయుడు బి.భావనా రుషిని అభినందించారు. ఉపాధ్యాయులు విశ్వేశ్వరరావు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న హెచ్‌ఎం విజయ ప్రశాంతి

నేత్రపర్వం.. శాంతి కల్యాణం

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శనివారం శ్రీవారి శాంతి కల్యాణం నిర్వహించారు. ఉదయం తోమాల సేవ, విష్ణు సహస్రనామార్చన నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో శ్రీ వారికి శాంతి కల్యాణం జరిపించారు. దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కూర్మన్నపాలెం: సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 87వ వార్డు తిరుమలనగర్ సచివాలయ పరిధిలో 20 లక్షల రూపాయలతో చేపట్టనున్న రోడ్లు, డ్రైనేజీల పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు), కార్పొరేటర్ బొండా జగన్నాథం, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి వాడపల్లి రామచంద్రరాజు, నాయకులు బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, కోమటి రమాదేవి, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

నేటి నుంచి ధనుర్మాస పూజలు

అగనంపూడి: శాంతినగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి వచ్చేనెల 13వ తేదీ వరకు ధనుర్మాస పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ఛైర్మన్ ఈ.కె.చారి తెలిపారు. ఉత్సవాల కరపత్రాలను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో సాయిబు నాయుడు, నరసింగరావు, గురునాథ్, కృష్ణారావు, సత్యనారాయణ,సోమశేఖర్,ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఉక్కు వెంకన్న ఆలయంలో..

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 17 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా డిసెంబర్ 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా వేకువజామున 4.30 నుంచి ఉత్తర ద్వార దర్శనం, జనవరి 4న ఉదయం 5.30 గంటలకు కుత్తువిళక్ (దీపహారతి), 7న శ్రీవారి తిరువీధి ఉత్సవం, 8న కర్పూర హారతి, నిర్వహిస్తామని తెలిపారు. 9న నీరాట ఉత్సవం, 12న కూడారై ఉత్సవం, 14న గోదా రంగనాధుల కళ్యాణం నిర్వహించనున్నామని తెలియజేశారు.

ఇంధన పొదుపుపై వ్యాసరచన పోటీలు

పెదగంట్యాడ: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో స్థానిక బీసీ రోడ్డులోని చైతన్య స్కూల్‌లో విద్యార్థులకు శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఏపీఈపీడీసీఎల్ మల్కాపురం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.త్రినాథ్ తదితరులు విజేతలకు బహుమతులు అందజేశారు. ఏపీఈపీడీసీఎల్ పెదగంట్యాడ టౌన్ ఏఈ శివ దుర్గాప్రసాద్, రూరల్ ఏఈ రవి, జేఈలు, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు గంగవరం పోర్టు ఆసరా

పెదగంట్యాడ: పేద ప్రజలు, దివ్యాంగులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అదానీ గంగవరం పోర్టు, అదానీ ఫౌండేషన్ తమ వంతు సహకారం అందజేస్తున్నాయని పోర్టు సీఎస్సార్ మేనేజర్ రమేష్‌బాబు అన్నారు. అదానీ గంగవరం పోర్టు, అదానీ ఫౌండేషన్ సీఎస్సార్ నిధులతో గంగవరంలో అంజలి టైలరింగ్ షాపు, కృప రెడీమేడ్ షాపు, శ్రీ దుర్గాదేవి బిర్యానీ అండ్ టిఫిన్ సెంటర్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలకు ఆర్థిక ఆసరా కల్పించేందుకు ఈ దుకాణాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పోర్టు యాజమాన్య ప్రతినిధులు అచ్యుతరావు, నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా శివపార్వతుల కల్యాణం



ఎమ్మెల్యే నాగిరెడ్డిని ఆశీర్వదిస్తున్న పురోహితులు

అక్కిరెడ్డిపాలెం: స్థానిక జెడ్పీ హైస్కూల్ ఎదురుగా గల మైదానంలో అక్కిరెడ్డిపాలెం సత్య సాయిబాబా భజన మండలి ఆధ్వర్యంలో శివ పార్వతుల కల్యాణం జరిపించారు. ఎమ్మెల్యే నాగిరెడ్డికి పురోహితులు ఆశీర్వచనం అందజేశారు. గుడివాడ లతీష్, కార్పొరేటర్ గోవింద రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సింహగిరి కాలనీలో రేకుల షెడ్డు దగ్ధం

గాజువాక: స్థానిక సింహగిరి కాలనీలో ఒక రేకుల షెడ్ దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా బొట్ట సన్యాసిరావుకు చెందిన షెడ్ దగ్ధమైనట్టు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని విద్యుత్ ఉపకరణాలతో పాటు ఇతర సామాన్లు దగ్ధమయ్యాయి. సుమారు రూ.2 లక్షల ఆస్తినష్టం జరిగినట్టు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

ప్రైవేటీకరణతో కార్మికుల భవిష్యత్తు అగమ్యగోచరం

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం వల్ల కార్మికుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారనుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల భద్రత కోసం సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1038వ రోజు, శనివారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుంటేనే దేశ భవిష్యత్తు బాగుంటుందన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులను పరిరక్షించి, స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

చందుకు క్రైస్తవ మత పెద్దల సత్కారం

గాజువాక: వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్తగా నియమితులైన ఉరుకూటి రామచంద్రరావు (చందు)ను గాజువాక ప్రాంత క్రైస్తవ మత పెద్దలు సత్కరించారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అద్దేపల్లి రవిబాబు ఆధ్వర్యంలో పలువురు పాస్టర్లు, చర్చి పాస్టర్లు ఆయన్ను కలిసి పుష్ప గుచ్ఛాలను అందజేసి, అభినందించారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో క్రైస్తవ మత పెద్దలు కింగ్ డేవిడ్ రాజు, బిల్లీగ్రహం, నారాయణ, శంకరరావు, ఎఫ్రాయేము, పాల్ డేవిడ్, సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



చందును సత్కరిస్తున్న క్రైస్తవ మత పెద్దలు

టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లో షార్ట్ సర్క్యూట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయింది. స్టీల్‌ప్లాంట్ పోలీసుల సమాచారం మేరకు వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్–8లోని 320 ఏ, డీ క్వార్టర్స్‌లో కొన్నేళ్లుగా బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ నిర్వహిస్తున్నారు. శనివారం అందులోని ఒక క్వార్టర్‌లో నుంచి పొగ రావడం గమనించారు. తర్వాత అవి మంటలుగా మారాయి. వెంటనే సీఐఎస్ఎఫ్ ఫైర్ విభాగానికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలు అదుపు చేశారు. ఈ సంఘటనలో ఎక్స్ఛేంజ్‌కు చెందిన కేబుళ్లు, మెషినరీ దగ్ధమయ్యాయి. స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు, ఎస్ఐ స్వామి నాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు.



దగ్ధమైన మెషినరీ